# సరికొత్త పాత సినిమా కథ

బద్వేలి రమేష్



అది ఆంధ్ర దేశంలో ఒక సినిమా థియేటర్. పేరుతో పనిలేదు చెప్పి తీరాలని మీరంటే- థియేటర్ పేరు "బోరే" అని తెల్సుకోండి. బోర్ థియేటర్‌లో ఇప్పుడు మాంచి తెలుగు సినిమా [జంతు వుంది కనుక] బంపర్ కలెక్షన్స్‌తో ఆడుతూంది. ఇదిగో మీరూ చూడండి.

• • •

పేరు : తెలుగు సినిమా చూడకు

నటుడు : మగ నల్లి

నటి : ఆడ నల్లి

[తక్కిన పాత్రధారుల పరిచయం అనవసరం. వాళ్ళు మీ నిజ జీవితంలో తారసిల్లే సజీవ పాత్రలు]

నిర్మాత : తెలుగు ప్రేక్షకుడు

దర్శకత్వం : కర్మ

[ఇంకా తెర వెనుక పాత్రధారుల పరిచయం అనవసరం. ఎందుకంటే వాళ్లు అనుక్షణం మీ పెదవుల్లో కదులుతూనే వుంటారు ]

• • •

దేవుడి మీద ఒక పాట- ఒక రీలు కదలిపోయింది అసలు [మామూలు] కథ ఆరంభమైందిక.

హీరో [మగనల్లి] పేరు రాజా. వీరిది ఆ థియేటర్‌లో రెండు రూపాయల క్లాసు. ఖరీదయిన వాళ్ళ రక్తం త్రాగి ఎర్రగా బుర్రగా ఉంటారు. అమ్మాయిల మీద ఓర చూపులు దోర దోర మాటలు వదలడం తప్ప మరో పని ఉండదు.

హీరో అలా నడచి నడచి లోక్లాసులోకి వచ్చారు. ఏభై పైసల తరగతి అధ్వాన్నంగా తోచింది. ఎటు చూసినా తాంబూల రస కాల్వలూ, సారా పట్టించిన గొంతుల గరగరలూ వాతావరణం చాలా ఘోరమాటికుగా ఉంది. అదంతా చూడగానే హీరోగారి కళ్ళు తిరిగిపోయాయి. వెంటనే అందుకొన్నారు.

ఇదా నా దేశం

ఏమవుతుంది దేశం

ఇదా సోషలిజం — అంటూ ఇజాలు వల్లించి పాట ముగించే సరికల్లా కెవ్వుమన్న కన్నెపిల్ల ఆర్తనాదం. హీరోగారు పళ్ళు నూరుతూ అటు వెళ్ళారు.

స్టంట్. ఢిష్యూం ఢిష్యూం. కరాటే ఫోజులతో కాసేపు కాలం గడిచి

పోయింది. ఆ ఆడపిల్లను బలవంతం చేయడానికి వచ్చిన దుండగీలు హీరో దెబ్బకు జడిసి పారిపోయారు.

హీరోయిన్ (ఆడపిల్ల) వెక్కి-వెక్కి ఏడ్చింది. పరమ స్టయిల్‌గా హీరోగారు తన కోటు తీసి ఇచ్చారు.

"సమయానికి దేవుడిలా...."అంటూ ఆగిపోయింది హీరోయిన్.

"నో....నో. అంతమాటనకండి.... ఏ మాత్రం మానవత్వం ఉన్న మనిషయినా ఈ మాత్రం చేయకపోడు."

హీరోయిన్ ఆరాధనగా చూసింది.

"పదండి. మీ ఇంటిదాకా వస్తాను" అన్నాడు.

* * *

తర్వాత హీరోయిన్ ఇంటికెళ్ళడం. అక్కడ ఆ ఇంట్లో వాళ్ళ మన్నన పొందడం. ఇక సీన్లు మామూలే.

* * *

హీరోయిన్ పేరు రాణి. రాణిగారు తనచెయ్యి చూసుకొంటున్నారు. ఆ రోజు కోటు ఇస్తూ హీరోగారి చేతివేళ్ళు ఈమెకు తగిలాయట. చూసుకొని కలలు కంటూంది.

(ఇక ఒక పాట ఉంది అని చెప్ప నవసరంలేదు.)

* * *

పాట అయిపోగానే అందమయిన డ్రెస్‌లో హీరో ఎదుట కన్పించారు.

"మీరా" అంది.

"అవును నేనే"

సిగ్గుగా ఇంట్లోకి తుర్రుమంది. హీరోగారు ఆ ప్రాంతంలో హాస్పిటల్ కట్టించాలని అనుకొంటున్నారట. అతని ఆశయానికి అందరూ జోహారు లర్పించారు.

* * *

హీరోగారి ఇంట్లో తండ్రిగారు ఉగ్రులై తందానా ఆడుతున్నారుహీరోను చూసి.

"నిన్ను చదివించింది, ఆ లోక్లాస్‌ను ఉద్ధరించడానికికాదు. ఛీ. ఛీ— నువ్వు నా ఇంటి నుంచి వెళ్ళిపో వెధవా" అన్నాడు.

"హుం మీ ఆస్తి, మీ బంగళా మీరే అనుభవించండి. చూడండి నాన్నగారు మానవత్వంలేని మనిషి పశువుతో సమానం" అంటూ విసవిసా, వెళ్ళిపోయారు.

ఇంతలో హీరోగారితల్లిగారు నిత్యం పట్టుచీరలోనే కన్పిస్తూంటారు. ఆవిడగారు "బాబూ, ఏమండీ" అంటూ అరుస్తూ కుప్పలా కూలిపోయారు.

ఇంతలో విరామం.

* * *

"ఎంత పని చేశారు"-అంది హీరోయిన్.

"ఛీ ఛీ ఆ మనుషులతో అలా గడపడం కన్నా, మీతో కలసి గంజి తాగి బ్రతకడం మేలు రాణీ."

"మీ రెంత ఎదిగిపోయారు" అంది రాణి.

"నేను మీ అండగా ఉంటాను. ఇక నుంచి మన ఇద్దరి మధ్య భేదాలులేవు" అంది రాణి.

అంతే ఒక డ్యుయెట్ పాట.

* * *

హీరోగారు చమటోడ్చి రిక్షాలాగి, పప్పురుబ్బి హాస్పిటల్ కట్టిస్తున్నారు.

ఇతన్ని చూసి ఆ పేటలోని జనం చందాలు వేసుకొని సాయం చెయ్య బోయారు.

"వద్దు నా కష్టంలో మరొకరిసాయం వద్దు అన్నారు హీరోగారు. త త్రరాణి బలవంతం చెయ్యగానే తీసుకోకతప్పింది కాదు.

* * *

"మన రాజా హాస్పిటల్ కట్టిస్తున్నాడట చూశారా" అంది రాజాగారితల్లి.

రాజాగారి తండ్రిగారు కోపంతో పళ్ళునూరాడు

* * *

"ఆ హాస్పిటల్‌కు నిప్పు పెట్టండి" అని పంపించారు తన మనుషులను రాజా తండ్రిగారు.

రాజాతల్లిగారు చాటుగా విని గుండె బాదుకొని చెప్పడానికి బయల్దేరారు.

* * *

అక్కడ రాజా, రాణిగారులు బ్రహ్మాండంగా స్టెప్స్ వేస్తూ సందడం చేసుకొంటున్నారు.

ఆ పాట అయిపోయే సమయానికల్లా రాజాగారితల్లి బాబూ అంటూ "జరగబోయే ప్రమాదం" చెప్పేశారు. అంతే హీరోగారికళ్లు ఎర్రగా మారిపోయాయి.

ఇంతలో రాజాగారి తండ్రిమనుషులు వచ్చారు. ఆ పేటలోని పిల్లా పెద్దా ఆడా మగా, ముసలిముతకా అందరూ ఏకమయి పోరాటం సాగించారు.

* * *

"బాబూ అమ్మగారు కాలినడకన ఆ బీదలపేటకు వెళ్ళారు" అని పని మనిషి చెప్పింది.

"హా" అంటూ రాజాగారి తండ్రిగారు బయల్దేరారు కారులో జోరుగా.

* * *

పోరాటంలో రాజాగారి తల్లి మీద కర్రదెబ్బ పడగానే కెవ్వుమన్నారావిడ

పోరాటం ఆగిపోయిందిక. రాజాగారు అమ్మా అంటూ అరిచారు

ఇంతలో లక్ష్మి అంటూ రాజాగారి తండ్రి ఏడుపు ముఖంతో వచ్చారు.

"భయపడకండి. మీ ఒడిలో సుమంగళిగా వెళ్ళిపోతున్నాను. నా కింతకన్నా ఆనందమూ, అదృష్టంలేదు. ఇకనయినా కొడుకుమీద కక్ష మానండి" అంది ఆవిడగారు .

వీల్లేదు మా అమ్మ చావరాదు. మా అమ్మను చంపడానికి ఎన్ని గుండెలు కావాలి ఆ యముడికి (కథా రచయిత) అనేలాచూస్తూ రాజాగారు ఆవిడను కారులో తీసుకెళ్ళారు.

ఆస్పత్రిలో డాక్టర్‌ని నానా విధాలుగా ప్రాథేయపడి ఎడ్మిట్ చేయించారు.

ఆవిడకు రక్తం కావాలి. రక్తం మేమిస్తాం మేమిస్తాం అంటూ ప్రజలు వచ్చారు ముందుకు. వారి మంచితనానికి రాజాగారి తండ్రి ముఖం వెలిగిపోయింది. రక్తం రాజానే ఇచ్చారు. ఆవిడ బ్రతికారు. ఆ సంతోషం అలా చిందులేస్తూంటే రాణి దూరంగాఉంది.

"రాణీ" అన్నాడు రాజా.

"మీ అంత పైెక్కడ మా అంత సైెక్కడ" అంది రాణి.

ఆమె నోరు మూసేశారు. హీరోగారు. అందరి మధ్య సిగ్గులేకుండా కౌగలించుకొన్నారు. శుభం.